సాక్షి పార్వతీపురం మన్యం

గురువారం । 10 । ఏప్రిల్ । 2025



ప్రతి నియోజకవర్గానికి విజన్ ప్లాన్

భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా ప్రతి నియోజకవర్గానికి విజన్‌ప్లాన్ రూపొందించాలని విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టర్లు కోరారు. - 8లో



ఆయుర్వేద వైద్యశాలలో మందుల కొరత - 8లో

ఆయుర్వేద వైద్యశాలలకు మందుల కొరత వెంటాడుతోంది. వైద్యులు రాసిన చీటీలు పట్టుకుని రోగులు మందుల దుకాణాలను ఆశ్రయిస్తున్నారు.

14న అంబేడ్కర్ జయంతి

పార్వతీపురం టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని ఈ నెల 14న నిర్వహిస్తామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు పార్వతీపురం ప్రభుత్వాస్పత్రి కూడలి వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామన్నారు. కార్యక్రమానికి ఎస్సీ నాయకులు, జిల్లా అధికారులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలన్నారు.

న్యూస్‌రీల్

బిల్లుమడ వైపు ఏనుగుల గుంపు



బిల్లుమడ వైపు వెళ్తున్న ఏనుగుల గుంపు

భామిని: వంశధార నదీ తీరంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు బుధవారం భామిని మండలం నేరడి–బి నుంచి బిల్లుమడ వైపు వెళ్లాయి. అక్కడి జీడి మామిడి తోటల్లో సంచరిస్తున్నాయి. ప్రస్తుతం జీడి పిక్కలు చేతికొచ్చే సమయం కావడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఏనుగుల తరలింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఏకలవ్య గురుకుల పాఠశాల పనుల పరిశీలన



కురుపాం ఏకలవ్య పాఠశాలను పరిశీలిస్తున్న విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావు

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): విజిలెన్స్ డీజీ హరిష్‌కుమార్ గుప్తా ఆదేశాల మేరకు శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా, అమలు విభాగం ఎస్పీ బర్ల ప్రసాదరావు ఇంజినీరింగ్ సిబ్బందితో కలిసి కురుపాంలో నిర్మించిన ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల పనులను బుధవారం పరిశీలించారు. నాణ్యత పరీక్షలు అనంతరం నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. తాగునీటి సమస్య, విద్యుత్ సరఫరాలో అంతరాయం, కిటికీలకు గ్రిల్స్ లేకపోవడం వంటి సమస్యలను విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకురాగా, తగు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. ఆయన వెంట విజిలెన్స్ డీఈ సత్యనారాయణ, ఈఈ మణిరాజు ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలో తాగునీటి సమస్య ఉంటే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 94902 01062కు ఫోన్‌చేసి తెలియజేయాలని ఐటీడీఏ పీఓ సి. యశ్వంత్‌కుమార్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫోన్ చేసిన వెంటనే సంబంధిత గ్రామానికి ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది వచ్చి సమస్య పరిష్కరిస్తారన్నారు.

బాలికా.. ఆశ్రమం భద్రమేనా?



- గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో బాలికలకు రక్షణ కరువు
- విధుల్లో పురుష సిబ్బంది
- తరచూ లైంగిక వేధింపు ఘటనలు
- రేగిడి ఘటనను గుట్టుగా ఉంచిన అధికారుల తీరుపై సందేహాలు

సాక్షి, పార్వతీపురం మన్యం/గుమ్మలక్ష్మీపురం:

- గుమ్మలక్ష్మీపురం మండలం రేగిడి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో వైద్యం పేరిట పురుష ఉపాధ్యాయులు బాలికలను బయటకు, ప్రైవేట్ ఆస్పత్రికి, ఆర్‌ఎంపీ వద్దకు గుట్టుగా వైద్యం కోసం తీసుకెళ్లడం వివాదాస్పదమైంది. ఈ పాఠశాలలో మహిళా వార్డెన్, ఉపాధ్యాయినులు ఉండగా.. పురుషులతో అత్యవసరంగా తీసుకెళ్లడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సంబంధిత అధికారులు పాఠశాలలో విచారణ చేసినా, అది కూడా గుట్టుగా ఉంచడం అనుమానాలకు బలం చేకూరుస్తోంది. పోనీ.. విచారణ అయినా మహిళా అధికారులతో చేయించారంటే అదీ లేదు.'
- గతంలో సాలూరు మండలం కురుకుట్టి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం.. బాలికలను తన గదిలోకి పిలిపించుకోవడం, అసభ్యకరంగా చేతులు వేసి మాట్లాడటం వంటివి చేపట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. సదరు హెచ్‌ఎంను సస్పెండ్ చేసి, పోక్సో కేసు నమోదు చేసినప్పటికీ.. తర్వాత ఆ కేసు నీరుగారిపోయింది.'
- కొన్నాళ్ల కిందట గుమ్మలక్ష్మీపురం మండలం పి.ఆమిటి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో బాలికను ఓ సీఆర్‌టీ గర్భం చేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు.. సదరు సీఆర్‌టీని సస్పెండ్ చేశారు.'
- కొంతకాలం కిందట గుమ్మలక్ష్మీపురం మండలం కేదారిపురం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో బాలికలను ఓ ఉపాధ్యాయుడికి సంబంధించిన కుటుంబ సభ్యుడొకరు వ్యానులో బయటకు తీసుకెళ్తుండగా.. పోలీసుల తనిఖీల్లో పట్టుబడటంతో విషయం వెలుగులోకి వచ్చింది.'

గిరిజనులంటేనే అమాయకత్వానికి మారుపేరు. సమాజానికి దూరంగా ఉండే అడవి బిడ్డలు.. ఇప్పుడిప్పుడే నలుగురిలా తామూ ఉండాలని కోరుకుంటున్నారు. తమలా పిల్లలూ కాకూడదని.. మంచి స్థానానికి చేరుకోవాలని, కాస్త దూరమైనా.. ఆశ్రమ పాఠశాలల్లో ఉంచి, విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. అభంశుభం తెలియని ఆ బాలికలను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన కొంతమంది ఉపాధ్యాయులు, సిబ్బంది ఏం చేస్తున్నారు.. తల్లిదండ్రుల స్థానంలో ఉండి, వారిని సంరక్షించాల్సింది పోయి.. మాయమాటలతో మభ్యపెడుతున్నారు. తెలిసీ తెలియనితనాన్ని ఆసరాగా చేసుకుని, తప్పుడు దారిలో వెళ్తున్నారు. జిల్లాలోని గిరిజన బాలికల సంక్షేమ పాఠశాలల్లో చోటుచేసుకున్న కొన్ని ఘటనలు.. ఆశ్రమ పాఠశాలల్లో బాలికల ఆశ్రయాన్ని వేలెత్తి చూపుతున్నాయి.

ఆశ్రమ పాఠశాలల్లో పర్యవేక్షణ కరువు

జిల్లాలో 55 వరకు గిరిజన సంక్షేమ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో బాలికలకు సంబంధించి పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో విజయనగరం, బొబ్బిలి, సాలూరు మండలం కొత్తవలస, సరాయివలస, కురుకుట్టి, మామిడిపల్లి, పాచిపెంట, రేగిడి, ఆమిటి, నీలకంఠాపురం, లంకజోడు, ఉదయపురం, కేదారిపురం కాలనీ, టీకే జమ్ము, ఉలిపిరిలలో ఆశ్రమ ఉన్నత పాఠశాలలున్నాయి. వాస్తవానికి బాలికల ఉన్నత పాఠశాలలో మహిళా సిబ్బందే ఉండాలి. దీనికి సంబంధించిన జీఓ 53ను 2005లో అప్పటి ప్రభుత్వం జారీచేసింది. నియామకాల్లోనూ మహిళలకే ప్రాధాన్యమివ్వాలని అందులో స్పష్టం చేసింది. ఒకవేళ పురుషులున్నా.. 50 ఏళ్ల దాటిన వారే ఉండాలని నిబంధనలు చెబుతున్నాయి. వారు కూడా రాత్రి వేళల్లో ఉండకూడదు. అందుకు భిన్నంగా యువకులు, మధ్యవయస్కులు సైతం ఇక్కడ పని చేస్తున్నారు. ఇటీవల సందేహాస్పద ఘటన జరిగిన రేగిడి పాఠశాలలో ఎనిమిది మంది వరకు పురుష సిబ్బంది 25 నుంచి 30 ఏళ్లలోపే వారు ఉన్నారని గిరిజన సంఘ నాయకులు చెబుతున్నారు. దీనివల్ల బాలికలకు భద్రత కరవవుతోంది. వారిపట్ల లైంగిక వేధింపులు అధికమవుతున్నాయి. కొన్ని ఘటనలు వెలుగులోకి వస్తున్నా.. చాలా వరకు గురువులన్న గౌరవం, భయంతో బయటకు చెప్పేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఐటీడీఏ అధికారుల పర్యవేక్షణ సైతం కొరవడుతోంది. ఏదైనా ఘటనలు వెలుగులోకి వచ్చినప్పుడు మహిళా అధికారిణులతో విచారణ జరిపిస్తే.. బాలికలు నిర్భయంగా వివరించగలరు. ఉన్నతాధికారులు సైతం ఇటువంటి విషయాల్లో నిర్లక్ష్యంగా పురుష అధికారులతోనే విచారణ జరిపిస్తుండడం గమనార్హం. ఫలితంగానే తప్పు చేసిన వారికి భయం ఉండడం లేదు. తరచూ ఇవే తరహా ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

తూతూమంత్రంగా విచారణ

గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో పురుష ఉపాధ్యాయులను ఎలా నియమిస్తారు? రేగిడి ఘటనలో అంత రహస్యంగా ప్రైవేట్ ఆసుపత్రులకు తీసుకెళ్లడం, దీన్ని గోప్యంగా ఉంచడం ఎందుకు? కనీసం దీనిపై తల్లిదండ్రులకైనా సమాచారం ఇచ్చారా? ఆశ్రమ పాఠశాలల్లో బాలికలకు సరైన రక్షణ ఇవ్వలేకపోతున్నారు. ఏదైనా ఘటనలు జరిగినప్పుడు విచారణను తూతూమంత్రంగా చేసి చేతులు దులుపుకొంటున్నారు. **– పాలక రంజిత్‌కుమార్, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి**

ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు సమస్యల ఏకరువు



మారేపాడులో గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

సాలూరు: రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు వద్ద గిరిజనులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. సాలూరు మండలంలోని మారేపాడు, తాడిలోవ, పాలికవలస గిరిశిఖర గ్రామాలకు డీవీజీ బుధవారం కాలినడకన వెళ్లారు. తొలుత మారేపాడు వెళ్లిన చైర్మన్‌కు అక్కడి గిరిజనులు తమ సమస్యలను తెలియజేశారు. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని, గ్రామానికి రోడ్డు సదుపాయం లేదని, పిల్లల ఆధార్ నమోదు సమస్యలు అధికంగా ఉన్నాయని, పోడు పట్టాలు అందజేయలేదని వివరించారు. అనంతరం ఆయన అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు వండిపెడుతున్న భోజనాన్ని పరిశీలించారు. మరో తాగునీటి పథకం, పోడు పట్టాలు మంజూరు చేయాలని తాడిలోవ గిరిజనులు విజ్ఞప్తి చేశారు. పాలికవలసలో అంగన్‌వాడీ కేంద్రం టీచర్ పోస్టు భర్తీ చేయాలని, శ్మశానానికి రోడ్డు మంజూరుచేయాలని, పోడు పట్టాలు ఇవ్వాలని గ్రామస్తులు కోరారు. పెదపదంలో గిరిజనులు సాగుచేస్తున్న అటవీ భూములు సర్వే చేశారే తప్ప పట్టాలు మంజూరు చేయలేదన్నారు. దీనిపై డీవీజీ స్పందిస్తూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.వి.రమణ, ఎంపీడీఓ పార్వతి, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు అధిగమించి రీసర్వే చేపట్టాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: జిల్లాలో జరుగుతున్న రీసర్వే 2.0లో వస్తున్న సాంకేతిక సమస్యలను అధిగమించి సర్వే కొనసాగించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తహసీల్దార్లను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రీసర్వేపై బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెబ్ ల్యాండ్‌లో పరిష్కారం కాని సాంకేతిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జేసీ ఎస్.ఎస్.శోభిక, సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యస్వంత్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో హేమలత, కేఆర్ఆర్‌సీ ప్రత్యేక ఉప కలెక్టర్ ధర్మచంద్రారెడ్డి, 15మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాలు తెరవండి

జిల్లాలో బీసీ కార్పొరేషన్ యూనిట్ల రుణాలు పొందేందుకు ఎంపికైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలను తెరవాలని కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. యూనిట్ల ఏర్పాటుపై మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలో కనీసం రూ.8 కోట్ల విలువగల యూనిట్లు ప్రారంభం కావాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ హేమలత, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.గడ్డెమ్మ, ఎల్‌డీఎం ఎస్. విజయ్‌స్వరూప్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మండలాల వారీగా యూనిట్లు ఇలా..

మండలం	యూనిట్లు
పాచిపెంట	52
గరుగుబిల్లి	87
కొమరాడ	50
సీతానగరం	35
సాలూరు	42
గుమ్మలక్ష్మీపురం	14
కురుపాం	5
భామిని	23
జియమ్మవలస	3

110 మంది సికిల్ సెల్ ఎనీమియా బాధితుల గుర్తింపు



సికిల్‌సెల్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న విశాఖ కేజీహెచ్ సిబ్బంది (ఫైల్)

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలో లక్షా 24వేల మందికి సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలు చేయగా 110 మంది వ్యాధితో బాధపడుతున్నట్టు గుర్తించారు. వారికి విశాఖపట్నం కేజీహెచ్ వైద్యులు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ మేరకు బాధితులకు నెలకు రూ.10 వేలు చొప్పున పింఛన్ ఇప్పించే ప్రయత్నం చేస్తున్నట్టు ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి తెలిపారు.

తాగునీటి ఎద్దడి నివారణకు తొలి ప్రాధాన్యం

- విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాకు జెడ్పీ నుంచి రూ.కోటి చొప్పున నిధుల కేటాయింపు
- తాగునీటి పంపింగ్‌కు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వెల్లడి
- పింఛన్ల తొలగింపుపై వాడీవేడిగా సాగిన చర్చ
- సంక్షేమ పథకాల అమలుపై బహిరంగ చర్చకు సిద్ధమన్న జెడ్పీ చైర్మన్
- మంత్రి ఆరోపణలకు కౌంటర్
- సమావేశానికి డుమ్మా కొట్టిన మంత్రి, కూటమి ఎమ్మెల్యేలు

విజయనగరం:

వేసవి దృష్ట్యా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు తొలి ప్రాధాన్యమివ్వాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధికార యంత్రాంగానికి స్పష్టం చేశారు. శివారు ప్రాంతాల ప్రజలు సైతం తాగునీటి కోసం ఇబ్బందులు పడే పరిస్థితి రాకూడదన్నారు. దీనికోసం జిల్లా పరిషత్ తరఫున జిల్లాకు రూ.కోటి చొప్పున నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. జెడ్పీ చైర్మన్ అధ్యక్షతన జెడ్పీ కార్యాలయంలో బుధవారం జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో వేసవిలో తాగునీటి సరఫరా, పింఛన్ల తొలగింపు, విద్య, విద్యుత్, మెడికల్ అండ్ హెల్త్, ఉపాధి హామీ, హౌసింగ్ తదితర అంశాలపై సభ్యులు చర్చించారు. జిల్లాలోని అన్నిబోర్ వెల్స్, తాగునీటి పథకాలు తనిఖీచేసి మరమ్మతులకు గురైతే వెంటనే బాగుచేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు జెడ్పీ చైర్మన్ సూచించారు. తోటపల్లి, చంపావతి, ఆంధ్ర జలాశయాల పరిధిలోని బోరు బావులను ముందే రీచార్జి చేసుకునేందుకు అనుమతులు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను కోరారు. నీటి పంపింగ్‌కు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. పింఛన్ల వెరిఫికేషన్ కోసం ఏ ఆధారంలేని దివ్యాంగులు ఆస్పత్రుల్లో ఏర్పాటుచేసే శిబిరాలకు హాజరు కావడం కష్టంగా ఉంటోందని, ప్రభుత్వమే సచివాలయ సిబ్బందిని తోడు పంపాలని కోరారు. వితంతువులందరికీ పింఛన్లు మంజూరు చేయాలన్నారు. సీహెచ్‌సీల్లో వైద్యుల పోస్టులు భర్తీచేసి మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాలన్నారు.

ఆలోచన చేస్తున్నాం

పింఛన్లపై చర్చలో గతేడాది నవంబర్ కంటే ముందు భర్తలు కోల్పోయిన మహిళలకు వితంతు పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్టు రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. అసలైన దివ్యాంగులకు పింఛన్లు మంజూరు చేయాలన్న ఉద్దేశంతోనే తనిఖీలు చేస్తున్నట్టు చెప్పారు. కార్లు, బైక్‌లు నడిపేవారికి పింఛన్లు ఎలా మంజూరు చేస్తామన్నారు. ఉపాధిహామీ వేతన బకాయిలు జనవరి 14 నుంచి చెల్లించాల్సి ఉందని, ఈ నెల 13, 14 తేదీల్లో చెల్లిస్తామని సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. ఉపాధిహామీ పనులు పంచాయతీ తీర్మానాలతో సంబంధంలేకుండా, నాణ్యతా ప్రమాణాలు లోపిస్తున్నాయని సభ్యులు ప్రస్తావించగా, కలెక్టర్ డా.బీఆర్.అంబేడ్కర్ స్పందిస్తూ గ్రామసభల్లో తీర్మానం చేసిన పనులనే చేపడుతున్నట్టు చెప్పారు. నాణ్యతలోపించే పనులు తన దృష్టికి తీసుకొస్తే తనిఖీ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ తాగునీటి సరఫరాకు అవసరమైన మెటీరియల్‌ను ఎంపీ నిధులతో సమకూర్చుతామని చెప్పారు.
- బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన మాట్లాడుతూ బొబ్బిలి మున్సిపాలిటీలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. విద్యుత్ లో ఓల్టేజీ సమస్య వేధిస్తోందన్నారు. బొబ్బిలి పీహెచ్‌సీలో ముగ్గురు వైద్యులకు ఒకే సారి బదిలీ చేశారని, కొత్తవారు వచ్చే వరకు వీరిని కొనసాగేలా చూడాలని అధికారులను కోరారు.

పింఛన్ల తొలగింపుపై రచ్చ



వాడీవేడిగా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస్, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మధ్య పింఛన్లపై చర్చ

ఉమ్మడి విజయనగరం జిల్లాలో పింఛన్ల తొలగింపుపై జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు మధ్య వాడీవేడిగా చర్చసాగింది. అర్హుల పింఛన్లు తొలగిస్తున్నారంటూ పలువురు సభ్యులు సమావేశంలో ప్రస్తావించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ గత ప్రభుత్వ హయాంలో 10 లక్షల పింఛన్లు తొలగించారంటూ వాఖ్యానించారు. దీనిపై జెడ్పీ చైర్మన్ తీవ్రంగా స్పందించారు. గవర్నర్ ప్రసంగంలో గత ప్రభుత్వ పాలన సమయానికి ఇచ్చే పింఛన్లు ఎన్ని..? కూటమి ప్రభుత్వం ఇస్తున్న పింఛన్లు ఎన్ని అన్నది స్పష్టంగా లెక్కలు ఉన్నాయని, మరి ఎందుకు పింఛన్లు తగ్గాయంటూ ప్రశ్నించారు. సర్వేల పేరుతో పింఛన్ల తొలగిస్తున్నారని ప్రజలంతా ఆందోళనకు గురవుతున్నారని, దీనికి స్పష్టమైన సమాధానం చెప్పకుండా గత ప్రభుత్వంపై బురదజల్లడం సరికాదన్నారు. గత ప్రభుత్వం ప్రతీ ఆరునెలలకోసారి అర్హతే ప్రామాణికంగా పింఛన్లు, సంక్షేమ పథకాలు అందజేసిన విషయాన్ని గుర్తుచేశారు. సభ సాక్షిగా ప్రజలకు మంచి జరగాలన్నదే అభిమతంగా సమస్యలపై చర్చిస్తున్నామన్నారు. కూటమి నేతలు సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు ఎందుకు అమలుచేయడంలేదని ప్రశ్నించారు. నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు...? ఉద్యోగం వచ్చేవరకు నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతి..? 50 సంవత్సరాలకే పింఛన్ మంజూరు..? మహిళలకు ఉచితబస్సు వంటి సూపర్ సిక్స్ హామీలు ఎందుకు అమలు చేయలేదన్నారు. అధికారంలో ఉండి పనులు చేయకుండా గత ప్రభుత్వంపై నెట్టడం సరికాదన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం కింద విజయనగరం జిల్లాలో 2,75,000 ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉండగా.. టీడీపీ చేసిన తప్పిదాల కారణంగా ఆయకట్టు తగ్గిపోయే పరిస్థితి నెలకొందన్నారు. 2024 ఏప్రిల్ 14 నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క పైసా కూడా జెడ్పీకి నిధులకు మంజూరు చేయలేదన్నారు. మంత్రి కొండపల్లి స్పందిస్తూ 15వ ఆర్థిక సంఘం పద్దు కింద రూ.9 కోట్ల నిధులు మంజూరు చేశామని సమాధానమివ్వగా... అవి కేంద్ర ప్రభుత్వం నిధులని, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన జనరల్ ఫండ్స్ నిధులు మంజూరు చేయలేదన్నారు. ఎంపీటీసీలు, ఎంపీపీలకు ఇవ్వాల్సిన గౌరవం వేతనం విడుదల చేయకపోవడం విచారకరమన్నారు. గత, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో సాగిన పాలనపై చర్చకు సిద్ధమైతే మేము సిద్ధమన్నారు. చర్చ మధ్యలో తూర్పుకాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్విని జోక్యం చేసుకుని గత ప్రభుత్వం చేసిన తప్పిదాలు కారణంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నా చాలడం లేదంటూ వాఖ్యానించడంతో సభలో ఉన్న సభ్యులు ఆమెపై ప్రశ్నల వర్షం కరిపించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో స్పష్టమైన సమాధానం చెప్పాలని సభ్యులంతా ప్రశ్నించడంతో ఆమె ఉక్కిరిబిక్కిరయ్యారు. చివరకు కలెక్టర్ అంబేడ్కర్ జోక్యం చేసుకుని పరిస్థితిని సద్దుమణిగించడంతో సభలో మిగిలిన అంశాలపై చర్చ సాగింది. సమావేశంలో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, జెడ్పీ సీఈఓ బెహరా వెంకట సత్యనారాయణ, ఉమ్మడి విజయనగరం జిల్లాలోని జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, అధికారులు పాల్గొన్నారు.

సభలో చర్చించిన కొన్ని అంశాలు..

- విద్యుత్ బిల్లుల భారం తగ్గించాలని, సర్దుబాటు చార్జీలను ప్రభుత్వమే భరించాలని సభ్యులు కోరారు.
- ఉపాధి హామీ పథకం మేట్‌ల అక్రమ నియామకాలను అరికట్టాలని, మండల తీర్మానాలు లేకుండా వెండర్స్‌తో పనులు చేయించడం తగదని పలువురు సభ్యులు సభ దృష్టికి తెచ్చారు.
- కురుపాం, గరుగుబిల్లి మండలాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆయా మండలాల సభ్యులు కోరారు. జీఎల్‌పురంలో పలు గ్రామాల్లో తాగు నీటి సమస్యను పరిష్కారించాలని ఇటీవల ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.
- సొంతింటి నిర్మాణం కోసం సచివాలయానికి వెళ్తే అక్కడి ఇంజినీరింగ్ అసిస్టెంట్ టీడీపీ నేతల నుంచి అనుమతి ఉండాలంటూ దరఖాస్తును చెత్త బుట్టలో పడేశారని దత్తిరాజేరు జెడ్పీటీసీ సభ్యుడు సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కలెక్టర్ అంబేడ్కర్ స్పందిస్తూ పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

బిల్లుల భారం మోయలేం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సురేష్ బాబు

విద్యుత్ బిల్లుల భారం వినియోగదారులు మోయలేని విధంగా ఉన్నాయని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. నెల్లిమర్ల మండలం మొయిద గ్రామంలో ఉన్న తన ఇంట్లో రెండు ఫ్యాన్లు, రెండు లైట్లు, ఒక ఏసీ వినియోగిస్తున్నామని, నెలకు రూ.లక్ష బిల్లు ఇచ్చారని సభలో ప్రస్తావించారు. నెల్లిమర్ల మండలం సారపల్లి గ్రామంలో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు మంజూరులో భాగంగా గత ప్రభుత్వ హయాంలో కొనుగోలు చేసిన సామగ్రిని రైతు భరోసా కేంద్రంలో నిరుపయోగంగా వదిలేశారని అధికారుల దృష్టికి తెచ్చారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా సమస్యలను తెలియజేశారు.

ఎమ్మెల్యేలు హాజరుకాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు..



11 మంది ఎమ్మెల్యేలకు ఇద్దరే హాజరు

జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన జిల్లా సర్వసభ్య సమావేశానికి మంత్రి సంధ్యారాణితో పాటు పలువురు ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. ప్రజల ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులు ప్రజాసమస్యలపై చర్చించాల్సిన సభకు హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో మొత్తం 11 ఎమ్మెల్యేలు ఉండగా.. గజపతినగరం ఎమ్మెల్యే, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన మాత్రమే హాజరయ్యారు. మిగిలిన 8 మంది ఎమ్మెల్యేలు, ఓ మంత్రి సభకు గైర్హాజరయ్యారు. ఇదే విషయమై మంత్రి శ్రీనివాస్‌ను విలేకరుల ప్రశ్నించగా.. తక్కువ సమయంలో సమాచారం అందించడంలో వారంతా హాజరుకాలేకపోయారని సమాధానం ఇచ్చారు.

క్లుప్తంగా

పశు సంవర్ధకశాఖ అధికారుల సంఘం అధ్యక్షుడిగా కృష్ణ



పశు సంవర్ధకశాఖ అధికారుల సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

విజయనగరం ఫోర్ట్: పశు సంవర్ధకశాఖ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ రెడ్డి కృష్ణ ఎన్నికయ్యారు. ఈ మేరకు స్థానిక పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో బుధవారం పశు సంవర్ధకశాఖ అధికారుల సంఘం నూతన కార్యవర్గానికి ఎన్నికలు నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ సీహెచ్. దీనకుమార్, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ టి.ధర్మారావు, కోశాధికారిగా డాక్టర్ కేవీరమణ, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ ఆర్. శారద ఎన్నికయ్యారు. ఈ ఎన్నికకు అధికారిగా రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడు బాలకృష్ణ వ్యవహరించారు.

డీసీహెచ్ఎస్‌గా డాక్టర్ పద్మశ్రీ రాణి



డీసీహెచ్ఎస్ పద్మశ్రీ రాణికి అభినందనలు తెలియజేస్తున్న కార్యాలయం సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయధికారి(డీసీహెచ్ఎస్)గా డాక్టర్ ఎన్.పి.పద్మశ్రీ రాణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తూర్పుగోదావరి జిల్లా ఇన్‌చార్జ్ డీసీహెచ్ఎస్‌గా పనిచేస్తున్న ఆమె ఉద్యోగోన్నతిపై రెగ్యులర్ డీసీహెచ్ఎస్‌గా ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీసీహెచ్ఎస్ పరిధిలో ఉన్న ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం డీసీహెచ్ఎస్ పరిధిలో ఖాళీ పోస్టులను పారదర్శకంగా భర్తీ చేస్తామన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆమెకు డీసీహెచ్ఎస్ కార్యాలయం సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

నెల్లిమర్ల: రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొనే అండర్-19 విభాగం జిల్లా జట్టును నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో బుధవారం ఎంపిక చేశారు. పురుషుల విభాగంలో నాగ వెంకట్(48-50), రోహిత్(50-55), ఎర్రి నాయుడు(55-60), ప్రవీణ్(60-65), కిరణ్(70-75), సూర్య తేజ(80-85), బాలకుమార్(85-90), లోకేష్(90+)లు ఎంపికయ్యారు. వీరు త్వరలో విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఎంపిక పోటీలను జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మద్దిల అప్పలనాయుడు, జనరల్ సెక్రటరీ లక్ష్మణరావు, జాయింట్ సెక్రటరీ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కాళ్ల మహేష్ తదితరులు నిర్వహించారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి



సింహాచలం మృతదేహం

బొబ్బిలి: ఎండ వేడిమికి తాళలేక తెర్లాం మండలం కె.సీతారాంపురానికి చెందిన కోస్టు సింహాచలం(58) బొబ్బిలి రైల్వేస్టేషన్‌లో బుధవారం మృతిచెందాడు. యాత కులస్తుడైన సింహాచలం వెదురుతో తయారయ్యే బుట్టలు, కోళ్ల గూళ్లను పటిష్టంగా ఉంచే నల్లుకట్టే పని చేస్తుంటాడు. ఈ పనిమీదనే రాయగడ వెళ్లి పనిముగించుకుని తిరిగి స్వగ్రామం వచ్చే సమయంలో బొబ్బిలి రైల్వేస్టేషన్‌లో దిగి ఎండ వేడిమికి సేదతీరుతూ అస్వస్థతకు గురై మృతి చెందినట్లు భావిస్తున్నారు. రెండో ప్లాట్‌ఫాంపై మృతి చెందిన వ్యక్తి సంఘటనలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే హెచ్‌సీ బి ఈశ్వరరావు తెలిపారు.

ప్రతి నియోజకవర్గానికి విజన్ ప్లాన్

- ఉమ్మడి జిల్లా కలెక్టర్లు డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్, శ్యామ్‌ప్రసాద్



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా కలెక్టర్లు డాక్టర్ అంబేడ్కర్, శ్యామ్‌ప్రసాద్

విజయనగరం అర్బన్: భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా ప్రతి నియోజకవర్గానికి విజన్ ప్లాన్ రూపొందించాలని విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ కోరారు. క్షేత్రస్థాయి పరిస్థితులు, అందుబాటులో ఉన్న వనరులను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. స్వర్ణాంధ్ర-2047 కెపాసిటీ బిల్డింగ్‌పై విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల అధికారులకు రెండు రోజుల వర్క్‌షాప్ బుధవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ప్రారంభమైంది. ఈ వర్క్‌షాప్‌కు హాజరైన కలెక్టర్లు అంబేడ్కర్, శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాకు సంబంధించిన డ్రాఫ్ ప్లాన్‌ను రూపొందించామని అలాగే నియోజకవర్గాలకు కూడా ప్రణాళికను రూపొందించాలని చెప్పారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని నియోజకవర్గ ఎంఎల్ఏల సలహాలను కూడా పరిగణనలోకి తీసుకుని ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. ముఖ్యంగా జిల్లాల భౌగోళిక పరిస్థితిని బట్టి వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ప్రగతికి ఎక్కువగా అవకాశం ఉంటుందన్నారు. విజయనగరం జిల్లాలో సుమారు 6,500 పైగా ఎంఎస్ఎంఈలు ఉన్నాయని వాటిని అభివృద్ధి చేయడం ద్వారా పారిశ్రామికంగా కూడా అభివృద్ధికి అవకాశం ఉంటుందని కలెక్టర్ అంబేడ్కర్ చెప్పారు. భోగాపురం విమానాశ్రయం పూర్తయితే పారిశ్రామిక, సేవా రంగాలు కూడా అభివృద్ధి చెందుతాయన్నారు. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి ఎంతో అవకాశం ఉందని, విజన్ 2047 డాక్యుమెంట్ భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు.

ఉద్యాన పంటల సాగును విస్తరించాలి

మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ అన్ని నియోజకవర్గాలకు ఒకే ప్రణాళిక పనిచేయదని, అక్కడి క్షేత్రస్థాయి పరిస్థితులను బట్టి ప్రణాళికను రూపొందించాలని సూచించారు. ప్రాథమిక రంగంలో ఉద్యాన పంటల సాగును విస్తరించడం, పశుసంపదను వృద్ధి చేయడం తదితర చర్యలపై సూచించారు. పండ్లు, కూరగాయల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల సూచనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. వర్క్‌షాప్‌ను విజయనగరం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ బుధవారం ఉదయం ప్రారంభించారు. ముఖ్య ఆర్థిక సూచికల ద్వారా, డేటాను సమీకరించడం, దానిని విశ్లేషించడం, ప్రణాళికలను రూపొందించడంపై శిక్షణ ఇచ్చారు. ఈ వర్క్‌షాప్‌లో ప్రణాళిక శాఖ విశ్రాంతి డైరెక్టర్, సలహాదారులు సీతాపతిరావు, మూడు జిల్లాల సీపీఓలు పి.బాలాజీ, వీర్రాజు, లక్ష్మీ ప్రసన్న, నియోజగకవర్గాల ప్రత్యేకాధికారులు, పర్యవేక్షణ బృందం సభ్యులు పాల్గొన్నారు.



పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

రోగనిరోధకశక్తి పెంపుదలతో వ్యాధులు దూరం

- త్వరలో దేశంలో ఇమ్యునో థెరపీ డ్రగ్స్
- వరల్డ్ అలెర్జీ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వ్యాకరణం నాగేశ్వర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ వ్యాకరణం నాగేశ్వర్

నెల్లిమర్ల/నెల్లిమర్ల రూరల్: ఇమ్యునో థెరపీ డ్రగ్స్‌తో శరీరం ఏ వ్యాధికి గురైనా దానిని అదుపు చేయడానికి అవకాశం ఉంటుందని వరల్డ్ అలెర్జీ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వ్యాకరణం నాగేశ్వర్ అన్నారు. ఈ మేరకు బుధవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఇంటిగ్రేటెడ్ మెడికల్ స్కిల్స్ అనే వర్క్‌షాపును వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగేశ్వర్ మాట్లాడుతూ రానున్న కాలంలో వివిధ రకాల వ్యాధులకు మాత్రలు, ఇంజక్షన్లకు బదులుగా ఇమ్యూనో థెరపీ డ్రగ్స్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇతర దేశాల్లో ఆ విధానం ఇప్పటికే కొనసాగుతోందని తెలిపారు. ఇదిలా ఉండగా అనేక వ్యాధులను నియంత్రించాలంటే ఇమ్యూనో థెరపీ డ్రగ్స్ చికిత్స కీలక పాత్ర పోషించనుందని చెప్పారు. వ్యాధుల నియంత్రణ యాంటిజన్, యాంటిబాడీ ప్రతి చర్యలపై ఆధారపడి ఉంటుందన్నారు. అందువల్లనే కోవిడ్ సమయంలో యాంటిబాడీ కణాలు ఎక్కువగా చనిపోవడం వల్ల రోగనిరోధకశక్తి తగ్గి ఎక్కువ మంది మత్యువాతపడ్డారని పేర్కొన్నారు. అప్పటి నుంచి ఇమ్యునాలజీకి ప్రాధాన్యం పెరిగిందని వివరించారు. అంతేకాకుండా మన దేశంలో వివిధ రకాల అలెర్జీలతో బాధపడుతున్న వారి సంఖ్య 35 శాతం ఉందని, వాటికి చికిత్సనందించే వైద్యులు మాత్రం దేశ వ్యాప్తంగా కేవలం 800 మంది మాత్రమే ఉన్నారన్నారు. త్వరలో సెంచూరియన్ విశ్వవిద్యాలయం, వరల్డ్ అలెర్జీ ఫౌండేషన్ సంయుక్తంగా మెడికల్ స్పెషలిస్ట్ అసిస్టెంట్ ప్రోగ్రాం అనే కొత్త కోర్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో ఉద్యోగావకాశాలు అత్యధికంగా ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రొపెసర్ శాంతమ్మ, రిజిస్ట్రార్ డాక్టర్ పి.పల్లవి, కన్వీనర్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డాక్టర్ చైతన్య, ఫోరెన్సిక్, అనస్థీషియా విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖలో నలుగురికి కారుణ్య నియామకాలు

- ఆర్డర్స్ ఇచ్చిన ఎస్పీ వకుల్



కారుణ్య నియామక పత్రాలను ఇస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: పోలీస్‌శాఖలో కారుణ్య నియామకాలు మొదలయ్యాయి.ఈ మేరకు శాఖలో కారుణ్య నియామకాలకు సంబంధించి శాఖలో మృతిచెందిన నలుగురి కుటుంబసభ్యులకు గురువారం ఎస్పీ వకుల్ జిందల్ నియామక పత్రాలను అందజేశారు. పోలీస్‌శాఖలో ఆర్మ్‌డ్, లా అండ్ ఆర్డర్‌లో వివిధ కారణాలతో ఇటీవల కొందరు మృతి చెందడంతో ఆయా కుటుంబాలలో కారుణ్య నియామకాలను భర్తీ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ విధి నిర్వహణలో మృతిచెందిన పోలీసు కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఆయా కుటుంబాలలో అర్హత ఉన్న వ్యక్తులకు ఉద్యోగ నియామక పత్రాలను ఇచ్చామని తెలిపారు. ఈ సందర్భంగా తరుణ్‌కుమార్, కోమలత, స్వామినాథ్, సాయిరెడ్డిలకు ఎస్పీ వకుల్ జిందల్ కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలను ఇచ్చారు. ఏఆర్ విభాగంలో పనిచేసిన ఏఆర్ హెచ్‌సీలు వెంకటరావు, అప్పలనాయుడు, సివిల్‌లో పనిచేసిన ఏఎస్సై కుమారస్వామి, హెచ్‌సీ చంద్రశేఖర్ ఇటీవలే అనారోగ్యాలతో మరణించారని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, డీపీఓ ఏఓ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ వరలక్ష్మి, జూనియర్ సహాయకురాలు చాముండేశ్వరి పాల్గొన్నారు.

బ్రాహ్మణ పురోహిత సంఘం రాష్ట్ర కార్యదర్శిగా సురేష్



బ్రాహ్మణ పురోహిత సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికైన సురేష్

దత్తిరాజేరు: బ్రాహ్మణ పురోహిత సంఘం రాష్ట్ర కార్యదర్శిగా గడసాం గ్రామానికి చెందిన ఇనుగంటి సురేష్‌కుమార్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయన బుధవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ పురోహిత సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సతీష్‌శర్మ నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. గజపతినగరం నియోజకవర్గంలోని బ్రాహ్మణుల అభ్యుదయానికి పాటుపడతానని, గజపతినగరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉన్న బ్రాహ్మణుల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయనున్నట్లు చెప్పారు.

ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం అధికార ప్రతినిధిగా త్రిశూల్‌కుమార్



వెంపటి శంకర నారాయణకుమార్ (త్రిశూల్ కుమార్)

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య ఉత్తరాంధ్ర జోన్ అధికార ప్రతినిధిగా విజయనగరం పట్టణానికి చెందిన త్రిశూల్ విద్యాసంస్థల అధినేత వెంపటి శంకర నారాయణ (త్రిశూల్ కుమార్)ను నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్‌కేమనోహర్‌రావుల నుంచి ఎంపిక ఆదేశాలు తనకు వచ్చినట్లు త్రిశూల్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

40 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్ట్



స్వాధీనం చేస్తున్న సారాను చూపిస్తున్న కురుపాం ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ప్రభుత్వ ఆదేశాలతో నిర్వహిస్తున్న నవోదయం 2.0 దాడుల్లో భాగంగా బుధవారం జియ్యమ్మవలస మండలం శిఖబడి గ్రామంలో 40 లీటర్ల సారాతో డి.సుందరం అనే వ్యక్తి పట్టుబడినట్లు కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఆ వ్యక్తి వద్ద లభించిన సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. అలాగే సారా సరఫరా చేసే బొమ్మాళి అరుణ్ అనే వ్యక్తిని కూడా అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

వీరఘట్టంలో 60 లీటర్ల సారా..

వీరఘట్టం: మండలంలోని పాల్లరోడ్డులో బుధవారం సాయంత్రం వాహన తనిఖీలు చేస్తుండగా బైక్‌పై వస్తూ బైక్ వదిలేసి ఓ వ్యక్తి పరారవడంతో సోదా చేసి బైక్‌పై ట్యూబ్‌లో 60 లీటర్ల సారా ఉన్నట్లు గుర్తించామని ఎస్సై జి.కళాధర్ తెలిపారు. సారాను స్వాధీనం చేసుకుని బైక్ సీజ్ చేశామని ఎస్సై చెప్పారు. బైక్‌పై సారా తరలిస్తున్న వ్యక్తి స్థానిక కొండవీధికి చెందిన దుర్గారావుగా గుర్తించి కేసు నమోదు చేశామన్నారు.

అంధ విద్యార్థులకు ఉచిత వసతి, విద్యాబోధన

- బొబ్బిలి ఏషియన్ ఎయిడ్ స్కూల్ టీచర్స్



ఎస్సై కె.లక్ష్మణరావుకు కరపత్రం అందజేస్తున్న బొబ్బిలి ఏషియన్ ఎయిడ్ స్కూల్ టీచర్స్

గజపతినగరం: ఒకటవ తరగతి నుంచి 10వతరగతి వరకు విద్యాభ్యాసంతో పాటు భోజన, వసతి సౌకర్యాన్ని అంధ విద్యార్థులకు ఉచితంగా కల్పించనున్నామని ఆసక్తి గల విద్యార్థులు చేరాలని బొబ్బిలి ఏషియన్ ఎయిడ్ స్కూల్ టీచర్స్ సుధాకర్ బుష్కి, బి.త్రినాథం, పి.రాజులు తెలిపారు. ఈ మేరకు బుధవారం గజపతినగరం ఎస్సై కె.లక్ష్మణరావుకు కరపత్రాలను అందజేసి విలేకరులతో మాట్లాడారు. గజపతినగరం, పురిటిపెంట, ఎం.వెంకటాపురం గ్రామాల్లో వారు పర్యటించి దృష్టి లోపం గల విద్యార్థులకు ప్రభుత్వ అనుసంధానంతో కూడిన బొబ్బిలి ఏషియన్ ఎయిడ్ స్కూల్ అన్నిరకాల సదుపాయాలను అందిస్తుందని ఆసక్తిగల వారు ముందుకు వచ్చి ఇక్కడ చదువుకుని ఉన్నతమైన స్థానాలకు చేరాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎంఈఓ కార్యాలయం, భవిత సెంటర్ సిబ్బందిని కలిసి కరపత్రాలను అందజేశారు.

ఆటోను ఢీ కొట్టిన ట్రాక్టర్: మహిళ మృతి

- మరో నలుగురిరు మహిళలకు గాయాలు



ఆదిలక్ష్మి మృతదేహం





ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

రామభద్రపురం: మండలంలోని గొల్లలపేట గ్రామం వద్ద బుధవారం ఆటోను ట్రాక్టర్ ఢీ కొట్టగా జరిగిన ప్రమాదంలో ఆటోలో ఉన్న ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదంలో అదే ఆటోలో ఉన్న మరో నలుగురు మహిళలకు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గర్భిణితో ఉన్న ఓ మహిళను చూసేందుకు గొల్లలపేట గ్రామం నుంచి కొట్టక్కి గ్రామానికి ఆటోలో ఐదుగురు మహిళలు బయల్దేరి వెళ్తున్నారు. సరిగ్గా ఆ గ్రామం దాటాక సచివాలయం సమీపంలోని శ్మశానం సమీపానికి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఓ ట్రాక్టర్ ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న బాలి లక్ష్మి(37) అక్కడికక్కడే మృతిచెందగా బాలి పద్మావతి, బాలి రమణమ్మ, లెంక సత్యవతి, బాలి వాసవిలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం తెలుసుకున్న వెంటనే ఎస్సై వి.ప్రసాదరావు సంఘటనస్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బాడంగి సీహెచ్‌సీకి, తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు, మృతురాలి భర్త రామకృష్ణ ఫిర్యాదు మేరకు ఎస్సై వి.ప్రసాదరావు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రామకృష్ణ వ్యవసాయకూలీ కాగా వారికి ఇద్దరు కుమార్తెలు లలిత, హేమ ఉన్నారు.

అక్రమ విద్యుత్ కనెక్షన్లపై విజిలెన్స్ దాడులు



పొలాల్లో అక్రమ విద్యుత్ కనెక్షన్లను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు చిట్టితల్లి, రమణ

మెరకముడిదాం: మండలంలోని పలుగ్రామాల్లో వినియోగిస్తున్న అక్రమ విద్యుత్ కనెక్షన్లపై విజిలెన్స్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా బుదరాయవలస, సోమలింగాపురం, ఇప్పలవలస గ్రామాల్లో వ్యవసాయ పంపసెట్లకు అక్రమ విద్యుత్ కనెక్షన్లపై దాడులు నిర్వహించి, ఆయా విద్యుత్ కనెక్షన్లు వాడుతున్న రైతులకు అపరాధరుసుం విధించారు. అలాగే పలు విద్యుత్ కనెక్షన్లను అధికారులు పరిశీలించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అధికారులు చిట్టితల్లి, బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టంలో ఆవులు, మేకల దొంగలు



ఆవులు, మేకల దొంగలపై ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధితులు

- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన స్థానికులు

వీరఘట్టం: గడిచిన రెండేళ్లుగా వీరఘట్టం మేజర్ పంచాయతీలోని గొల్లవీధి, తెలగవీధి, పెరుగువీధి, మేకలవీధితో పాటు పలు వీధుల్లో ఆవులు, మేకలు, దూడలను ఆగంతుకులు ఎత్తుకుపోతున్నారనే విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం రాత్రి కొంతమంది వ్యక్తులు తెలగవీధిలోని ఓ ఇంటి ముందు ఉన్న రెండు ఆవులను ఎత్తుకెళ్లే ప్రయత్నం చేస్తుండగా స్థానికులు అడ్డుకోవడంతో ఆగంతుకులు తప్పించుకుని పారిపోయారని తెలగవీధికి చెందిన వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. తెలగవీధిలో మూగజీవాలను ఎత్తుకెళ్లే ప్రయత్నం చేశారనే విషయం తెలియడంతో చాలా వీధుల నుంచి బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. రెండేళ్లుగా మా పశువులను కూడా గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని పోలీసులకు తెలియజేశారు. గురువారం పూర్తి స్థాయిలో అందరం కలిసి ఫిర్యాదు చేసేందుకు బాధితులంతా ఏకతాటిపైకి వచ్చారు. ఆవులు, మేకలను దొంగిలిస్తున్న వారిపై కఠినంగా చర్యలు చేపట్టాలని పోలీసులను కోరారు.

ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం



ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న విశ్రాంత ఐఏఎస్ మురళి

బొండపల్లి: ప్రతిరోజూ క్రమం తప్పకుండా ధ్యానం చేయడం ద్వారానే ఆరోగ్యంగా ఉండడానికి అవకాశం ఉంటుందని విశ్రాంత ఐఏఎస్ అధికారి జె.మురళి పెర్కొన్నారు. ఈ మేరకు బొండపల్లి మండలకేంద్రంలో మూడు రోజుల పాటు శ్రీరామచంద్ర మిషన్, హార్ట్‌వెల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగా ,ధ్యానం శిక్షణ తరగతుల్లో భాగంగా చివరిరోజు బుధవారం ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఐఏఎస్ అధికారి మురళి మాట్లాడుతూ నేడు ప్రతి ఒక్కరూ కూడా తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతూ అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. అనారోగ్యం నుంచి బయట పడాలంటే మనస్సును ప్రశాంతంగా ఉంచుకుని ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ధ్యానం చేయడం ద్వారా మానసిక ఒత్తిడి నుంచి దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు జేఎస్ఎన్.రాజు, జె.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹220

ఆయుర్వేద వైద్యశాలలో మందుల కొరత

- ప్రైవేట్ దుకాణాల్లో కొనుగోలు చేస్తున్న రోగులు

విజయనగరం ఫోర్ట్: ☛ గంట్యాడ మండలానికి చెందిన వి. నారంనాయుడు మోకాళ్ల నొప్పులతో విజయనగరంలో ఉన్న ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలకు కొద్ది రోజుల క్రితం వెళ్లాడు. అక్కడ మందులు లేక పోవడంతో ప్రైవేట్ ఆయుర్వేద ముందుల దుకాణంలో కొనుగోలు చేశాడు.

☛ విజయనగరం మండలానికి చెందిన పి.లక్ష్మి చర్మ సంబంధిత వ్యాధితో విజయనగరంలో ఉన్న ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలకు వెళ్లగా అక్కడి వైద్యుడు రాసిన మందులు లేకపోవడంతో ప్రైవేట్ ఆయుర్వేద మందుల దుకాణంలో మందులు కొనుగోలు చేసింది.

వీరిద్దరే కాదు. అనేక మంది రోగులకు ఎదురువుతున్న పరిస్థితి ఇదే. ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నామని. ప్రజారోగ్యానికి కోట్లాది రుపాయలు ఖర్చు చేస్తున్నామని కూటమి ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. కానీ వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. అల్లోపతి వైద్యం తర్వాత ఆయుర్వేద వైద్యానికి అంత ప్రాధాన్యం ఉంది. అయితే ప్రస్తుతం ఆయుర్వేద వైద్యశాలలో మందులు లేక పోవడంతో వైద్యం కోసం వచ్చిన వారు నిరాశతో వెనుదిరగాల్సిన పరిస్థితి.



ఆయుర్వేద మందులు



ప్రభుత్వ ఆయుర్వేదవైద్యశాల

సాధారణ వ్యాధులకు కూడా లేని మందులు

ఆయుర్వేద వైద్యశాలలో సొరియాసిస్, మధుమేహం, కీళ్ల నొప్పులు, గైనిక్ సమస్యలు, జీర్ణ కోశ వ్యాధులు, మూత్ర వ్యాధులు, న్యూరాలజికల్ సమస్యలు, గుండెజబ్బులు, రుమటైడ్ ఆర్థరైటిస్, శ్వాసకోశసమస్యలకు సంబంధించిన మందులు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో ప్రస్తుతం లేవు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వైద్యుడికి చూపించిన తర్వాత మందుల గది వద్దకు వెళ్లిన రోగులకు అక్కడ మందులు లేక పోవడంతో ప్రైవేట్ మందుల దుకాణాల్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. కొంత కాలంగా ఇదే పరిస్థితి ఉంది.



వైద్యం కోసం వచ్చిన రోగులు

ఇండెంట్ పెట్టాం

చాలావరకు మందులు అయిపోయాయి. మందులు పంపించాలని ఇండెంట్ పెట్టాం. ఇంకా రాలేదు.

ఎం.ఆనంద్‌రావు, వైద్యాధికారి, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల

ఢిల్లీలో దొరికాడు



నిందితుడు హరీష్ గంగాధర్‌ను అరెస్టు చేసిన రెండో పట్టణ పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్: విదేశాల్లో చదువుకోవాలనుకున్న విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసి యూనివర్సిటీలో ఫీజులు కట్టకుండా ఎగ్గొట్టిన వ్యక్తిని ఎట్టకేలకు రెండో పట్టణ పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ అంశంపై ఏడుగురు బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు గత ఏడాది జులై 29న ఎస్పీ గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ పి.ఈశ్వరరావు తెలిపిన వివరాల్లోకి వెళ్తే.. కజికిస్తాన్ మెడికల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ సీట్లు ఇప్పిస్తానని శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన కొందరు విద్యార్థుల నుంచి తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌కు చెందిన హరీష్ గంగాధర్ ఒప్పందం ప్రకారం ఒక్కొక్కరి వద్ద రూ. 25 లక్షల నుంచి రూ. 45 లక్షల లోపు వసూలు చేశాడు. కజకిస్తాన్‌లో కళాశాల, వసతిగృహానికి సంబంధించి ఒక సంవత్సర ఫీజును మాత్రమే చెల్లించి మిగతా సొమ్ము సుమారు రూ. 2 కోట్లు కాజేశాడని సీఐ తెలిపారు. ఎప్పటి నుంచో తప్పించుకుని విదేశాల్లో తిరుగుతున్న హరీష్ గంగాధర్‌ను పట్టుకునేందుకు లుకౌట్ నోటీస్ పంపామని, ఎట్టకేలకు ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ఇమ్మిగ్రేషన్ అధికారులు పట్టుకుని తమకు సమాచారం అందించారన్నారు. దీంతో ఢిల్లీ తమ పోలీసులను పంపి హరీష్ గంగాధర్‌ను అదుపులోకి తీసుకున్నామని బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు అరెస్టు చేసి రిమాండ్ కోసం కోర్టుకు తరలించామని సీఐ ఈశ్వరరావు వెల్లడించారు.